SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 225 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 24 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5



## ఉగ్రదాడికి దీటైన జవాబు ఉంటుంది

- ప్రపంచ దృష్టిని ఆకర్షించడమే టెర్రరిస్టుల లక్ష్యం
- ఆర్టికల్ 370 ఎత్తేశాక కశ్మీర్‌లో పరిస్థితి మారుతోంది
- అక్కడ ప్రశాంతతకు భంగం కలిగించేందుకు కుట్రలు
- జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ రాజేంద్రకుమార్

2లో



# ఇది సీమాంతర కుట్రే

- జమ్మూకశ్మీర్ అభివృద్ధిని సహించలేకే ఉగ్రదాడి
- హంతకుల భరతం పడతాం... సూత్రధారులను దోషులుగా నిలబెడతాం
- ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ స్పష్టీకరణ
- సింధూ జలాల ఒప్పందం అమలు తక్షణమే నిలిపివేత
- అటారీ వద్ద చెక్‌పోస్టు మూసివేత
- పాక్ జాతీయులు భారత్‌ను వీడి వెళ్లాలని ఆదేశం
- పహల్గాంలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది పేర్లతో జాబితా విడుదల
- మృతుల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ వాసులు
- జమ్మూకశ్మీర్ నుంచి వెళ్లిపోతున్న పర్యాటకులు
- ముష్కరులను కఠినంగా శిక్షిస్తామన్న అమిత్ షా

2లో

## అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులు

- శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- వేదిక మీద 30 మంది రాజధాని రైతులు, మహిళలకు అవకాశం
- సభకు ఐదు లక్షల మంది ప్రజలు
- హెలిప్యాడ్ నుంచి సభావేదిక వరకు ప్రధాని రోడ్ షో
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

2లో





## హైదరాబాద్ చేరుకున్న సీఎం

సమయం న్యూస్ : హైదరాబాద్: ఏడు రోజుల జపాన్ పర్యటన ముగించుకుని బుధవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

## అత్యంత.. హేయమైన చర్య

- ఉగ్రదాడిపై ప్రపంచ దేశాల స్పందన
- ప్రధాని మోదీతో ఫోనులో మాట్లాడిన ట్రంప్

వాషింగ్టన్, లండన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో నిస్సహాయులైన పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి ఈ ఘటనను అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నాయి. ప్రధాని మోదీతో ఫోనులో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్...దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడంలో భారత్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. అమెరికా చట్టసభ

తరువాయి 2లో



## రెండు రోజులు వడగాల్పులు

- సాధారణం కన్నా 2-3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలకు అవకాశం

2లో



## దేశమంతా సమైక్యంగా నిలబడాలి



2లో

- కేంద్రం చేపట్టే ప్రతి కార్యక్రమానికి సంఘీభావం
- దేశ సుస్థిరత, సమగ్రతను దెబ్బతీసే శక్తులను దీటుగా ఎదుర్కోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉగ్ర దాడి మృతులకు నివాళి

## పాక్ ఆర్మీ చీఫ్ ఉసిగొల్పారా?

- ఆయన విద్వేష వ్యాఖ్యలు ఆజ్యం పోశాయా..
- అనుమానాలను రేకెత్తిస్తున్న ఉగ్ర దాడి
- విదేశీ అగ్ర నేతలు పర్యటిస్తున్నప్పడే అరాచకం

2లో



epaper.samayamdaily.net
APTEL/2006/18267
సమయం



# ఇది సీమాంతర కుట్రే

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ నరమేధానికి పాల్పడిన ముష్కరులను శిక్షించడంతో పాటు వారిని ఎగదోస్తున్న శక్తులనూ బాధ్యులుగా నిలబెడతామంటూ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని వీడే వరకూ ఆ దేశం పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దౌత్య సంబంధాల స్థాయినీ తగ్గించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం దిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సరిహద్దుల్లో భద్రతా బలగాలను అప్రమత్తం చేసింది. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ పలు దేశాలు భారత్‌కు సంఘీభావం ప్రకటించాయి. ఉగ్రవాద నిర్మూలన కృషిలో అండగా నిలుస్తామని తెలిపాయి. మంగళవారం నాటి ఘటనలో మృతి చెందిన 26 మంది పేర్లను వెల్లడిస్తూ అధికారులు జాబితా విడుదల చేశారు. ఉగ్రదాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్ నుంచి పర్యాటకులు స్వస్థలాలకు తిరిగి వెళ్తున్నారు. కశ్మీర్‌కు వచ్చేందుకు హోటళ్లు, రైళ్లు, విమాన టికెట్లను రిజర్వు చేసుకున్న వాళ్లు వాటిని రద్దు చేస్తున్నారు. పహల్గాంలోని ఘటనా స్థలాన్ని పరిశీలించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా...బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనగర్‌కు తరలించిన మృతదేహాలకు నివాళులర్పించారు.



**రెండు గంటలకు పైగా భేటీ**

ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) బుధవారం సాయంత్రం దిల్లీలోని లోక్‌నాయక్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసంలో సమావేశమైంది. రెండున్నర గంటలకు పైగా కొనసాగిన భేటీలో హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్‌తో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, సీనియర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీసీఎస్ భేటీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఉగ్రదాడి ఘటన తెలిసిన వెంటనే తన అమెరికా పర్యటనను అర్థంతరంగా ముగించుకుని ఆమె దిల్లీకి బయలుదేరారు. మార్గమధ్యంలోనే ఉండడంతో భేటీకి హాజరుకాలేకపోయారు. హోంమంత్రి అమిత్ షా పహల్గాం ఘటనను ప్రధాని మోదీకి వివరించారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అంతకుముందు...సౌదీ అరేబియా పర్యటనను కుదించుకొని దిల్లీ చేరుకున్న ప్రధాని మోదీ విమానాశ్రయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ ఆ భేటీలో పాల్గొన్నారు.

**అమిత్ షా పరామర్శ**

బుధవారం ఉదయం శ్రీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తీసుకువచ్చిన 26 మంది మృతదేహాలపై హోంమంత్రి అమిత్ షా పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. హంతకులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో బైసరన్‌కు చేరుకున్న అమిత్ షా... ఉగ్రదాడి జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బుధవారం సాయంత్రం అనంతనాగ్‌కు వెళ్లి అక్కడ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అమిత్ షా వెంట జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఉన్నారు.

**రూ.10లక్షల పరిహారం**

ఉగ్రదాడిలో ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2లక్షల చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున నగదు సహాయం చేయనున్నట్లు వెల్లడించింది.

**పాక్ గగనతలంలోకి వెళ్లకుండా...**

సౌదీ అరేబియా పర్యటనను కుదించుకుని ప్రధాని మోదీ దిల్లీ వస్తోన్న సమయంలో ఆయన ప్రయాణిస్తోన్న విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించింది. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్‌లో ఉన్న దృశ్యాల ద్వారా ఈ విషయం తెలిసింది. సౌదీ అరేబియాకు వెళ్లే సమయంలో ప్రధాని మోదీ ప్రయాణించిన ఎయిర్‌ఫోర్స్ బోయింగ్ 777300 విమానం పాకిస్థాన్ గగనతలం మీదుగానే రియాద్ చేరుకుంది. అయితే, దాడి నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి ముప్పు ఉండొచ్చన్న నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా తిరుగు ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగించారు. ప్రధాని విమానం అరేబియా సముద్రం మీదుగా గుజరాత్ గగనతలంలోకి ప్రవేశించి అక్కడి నుంచి దిల్లీకి చేరుకుంది.

**ఆచూకీ చెబితే రూ.20 లక్షలు**

ముష్కరుల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 లక్షల బహుమతి ఇస్తామని జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్ పోలీసులు ప్రకటించారు. 'ఈ పిరికిపంద చర్యలో పాల్గొన్న ఉగ్రవాదుల్ని బంధించడానికి, లేదా మట్టుబెట్టడానికి ఉపయోగపడే సమాచారం ఇచ్చేవారికి ఈ రివార్డు అందుతుందని 'ఎక్స్'లో తెలిపారు.

# అత్యంత హేయమైన చర్య

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు, ప్రవాస భారతీయులు కూడా దాడులను ఖండించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఉగ్రదాడిని మంగళవారం ఖండించగా, బుధవారం యూరోపియన్ యూనియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ దాడుల్ని 'నీచమైన' చర్యగా అభివర్ణించారు.

- **భారత ప్రజల పక్షానే అమెరికా**

**ప్రధానికి వాన్స్ ఫోన్**

దిల్లీ: భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బుధవారం ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ క్లిష్ట సమయంలో భారత ప్రజల పక్షాన అమెరికా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఉగ్ర దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడేందుకు అవసరమైన అన్ని సాయాలను అందిస్తామని వాన్స్ హామీ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్‌లు మద్దతుగా నిలిచినందుకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

# ఉగ్రదాడికి దీటైన జవాబు ఉంటుంది

హైదరాబాద్ : ''సుదీర్ఘకాలంగా రగులుతున్న కశ్మీర్‌ను చక్కదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు పహల్గాం ఉగ్రదాడి తాత్కాలిక ఎదురుదెబ్బ మాత్రమే. మన దేశం దీనికి దీటుగానే సమాధానం చెబుతుంది. జమ్మూకశ్మీర్ కూడా ఈ గాయం నుంచి త్వరగానే కోలుకుంటుంది'' అని ఆ రాష్ట్ర మాజీ డీజీపీ రాజేంద్రకుమార్ తెలిపారు. 1984 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయన మూడు దశాబ్దాలకుపైగా కశ్మీర్‌లో వివిధ హోదాల్లో పనిచేసి 2017లో డీజీపీగా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అక్కడ పరిస్థితులు అనూహ్యంగా మారుతున్నాయి. ప్రశాంతత, పర్యాటకం పెరిగాయి. వ్యాపారం వృద్ధి చెంది అభివృద్ధి కనిపిస్తోంది. దాంతో ప్రజల ఆలోచనా ధోరణిలోనూ మార్పు వస్తోంది. ఉగ్రవాదులకు ప్రశాంతత అంటే గిట్టదు. దీన్ని భగ్నం చేసేందుకే పర్యాటకులను లక్ష్యంగా చేసుకున్నారు. అలాగే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మనదేశంలో, మన ప్రధాని మోదీ మిత్ర దేశమైన సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నప్పుడే ఈ దాడికి పాల్పడ్డారు. తద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించవచ్చనేది వారి వ్యూహం. అయితే, కశ్మీర్ గతంలో ఇలాంటి గాయాలనెన్నో చూసింది. క్రమంగా కోలుకుంది. ఇప్పుడూ అలానే జరుగుతుంది. భారతదేశం గతంలోలా లేదన్నది నిర్వివాదాంశం. ఆ విషయం సర్జికల్ దాడులు, బాలాకోట్ ఉదంతంతోపాటు గాల్వాన్, డోక్లాంలలో రుజువైంది.

# రెండు రోజులు వడగాల్పులు

హైదరాబాద్: రాష్ట్రంలో భానుడి సెగలు పెరుగుతున్నాయి. రానున్న మూడు రోజుల పాటు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రానున్న రెండు రోజుల పాటు పగలు వడగాల్పులు, రాత్రివేళల్లో వేడి వాతావరణం నమోదవుతుందని వెల్లడించింది. ''నిజామాబాద్ జిల్లాలో బుధవారం అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కన్నా 3.6 డిగ్రీలు ఎక్కువ. ఆదిలాబాద్ జిల్లాలో 44.3, మెదక్‌లో 43.4, రామగుండంలో 42.8, ఖమ్మం జిల్లాలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి'' అని తెలిపింది.

**వడదెబ్బతో ఏడుగురి మృతి**

న్యూస్‌టుడే బృందం: రోజురోజుకు పెరుగుతున్న ఎండలు రాష్ట్ర ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వడదెబ్బకు ఏడుగురు మృతి చెందారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఆష్టా గ్రామానికి చెందిన గంగారాం (55), కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కల్లెం రమేశ్ (54), ఖమ్మం జిల్లా మధిర పట్టణం రామనాథం వీధికి చెందిన శేషాచారి (80), పెద్దపల్లి జిల్లా గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పుల్లూరి రమేష్‌కుమార్ (37), వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన రవళి (35), హైదరాబాద్ చందానగర్ ఠాణా పరిధిలోని లింగంపల్లి రైల్వేస్టేషన్ ఆరో ప్లాట్‌ఫాం ప్రాంతంలో ఓ యాచకుడు (70), కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం మార్లవాయి గ్రామానికి చెందిన కనక కాశీరాం (42) మరణించారు.

# పాక్ ఆర్మీ చీఫ్ ఉసిగొల్పారా?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి పహల్గాం ఉగ్ర దాడికి.. 2000 సంవత్సరంలో జరిగిన ఛత్తీసింగ్‌పొర నరమేధానికి పోలికలు కనిపిస్తున్నాయి. దేశంలో విదేశీ అగ్ర నేతల పర్యటనలు సాగుతున్న వేళే ఇవి చోటుచేసుకున్నాయి. దీనికి తోడు పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ రెచ్చగొట్టే ప్రసంగం తర్వాతే దాడి జరగడం గమనార్హం. అసీం మునీర్‌కు.. భారత్‌పై తీవ్రమైన ద్వేషంతో ఉంటాడన్న పేరుంది. ఆయన ప్రకటనలూ ఉగ్ర దాడికి పురిగొల్పేలానే ఉంటాయి. దీనికి తోడు జమ్మూ కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి విదేశీ అతిథుల పర్యటనను ఉగ్రవాదులు వాడుకుంటున్నారనే అనుమానాలు బలంగా ఉన్నాయి. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో ఉండటం.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో పహల్గాం దాడి చోటుచేసుకోవడం గమనార్హం.

**పుల్వామా దాడి వేళ మునీరే ఐఎస్ఐ అధిపతి**

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్ర దాడి వెనుక పాక్ కోణాన్ని విస్మరించలేం. ఇటీవల అసీం మునీర్ చేసిన రెచ్చగొట్టే ప్రసంగమే ఈ దాడికి పురిగొల్పిందనే వాదనలను బలపరిచే ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల ఆయన ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ.. 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన జీవనాడిలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం. మీరు మీ పిల్లలకు పాకిస్థాన్ కథ చెప్పండి. మన జీవితంలోని ప్రతి అంశంలోనూ హిందువుల కంటే భిన్నమని భావించిన మన పూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారు గుర్తుంచుకుంటారు. మన మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు భిన్నమైనవి. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనవి రెండు దేశాలు' అని మునీర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పహల్గాం దాడి చోటుచేసుకుంది. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం అనుమానాలను బలపరుస్తోంది. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి జరిగినప్పుడు మునీర్ పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అధిపతిగా ఉన్నారు. ఆ దాడి ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఇప్పుడు ఆయనే ఆర్మీ చీఫ్ కావడంతో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకను ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

# దేశమంతా సమైక్యంగా నిలబడాలి..



విశాఖపట్నం: 'దేశానికి ఎంతో కీలకమైన కశ్మీర్‌లో ఇటీవల ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించి గత మూడేళ్లుగా ప్రశాంత వాతావరణంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అలాంటి సమయంలో ఉగ్రదాడి జరగడం చాలా బాధాకరం. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ దీన్ని తీవ్రంగా ఖండించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. పహల్గాంలో ఉగ్ర దాడిలో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళి మృతదేహాన్ని బుధవారం రాత్రి అధికారులు విశాఖ విమానాశ్రయానికి తీసుకువచ్చారు. చంద్రబాబు అక్కడికి చేరుకొని నివాళులర్పించారు. ఉగ్రమూకల దాడిలో మృతి చెందిన చంద్రమౌళి, కావలికి చెందిన మధుసూదనరావు చిత్రపటాలతో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భారత్‌ను ఏమీ చేయలేరు: 'ఉగ్రమూకల దాడి షాక్‌కు గురి చేసింది. విహారానికి వెళ్లిన పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం తీవ్ర విషాదకరం. చంద్రమౌళితో పాటు వెళ్లిన ప్రత్యక్షసాక్షి శశిధర్ చెప్పినదాన్ని బట్టి చూస్తే ఉగ్రవాదులు అనాగరికంగా, మానవత్వం లేకుండా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. ఆడవాళ్లను వదిలిపెట్టి మగవారినే కాల్చడం చూస్తే ప్రణాళిక ప్రకారం చేసినట్లు అర్థమవుతుంది' అన్నారు. 'దేశంలో సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వం ఉంది. ఇలాంటి టెర్రరిస్టులు భారత్‌ను ఏమీ చేయలేరు. ఈ తరహా ఘటనలతో అలజడి రేపాలని చూడటం వాళ్ల అవివేకం. క్లిష్టపరిస్థితులు వచ్చినప్పుడు దేశమంతా సమైక్యంగా నిలబడాలి. అందరం మోదీ నాయకత్వంలో కేంద్రం చేసే ప్రతి కార్యక్రమానికీ సంఘీభావం తెలియజేయాలి. దేశ సమగ్రత, సుస్థిరతను దెబ్బతీసేందుకు ఎలాంటి వ్యక్తులు, శక్తులు ప్రయత్నించినా దాన్ని దీటుగా ఎదుర్కొంటామని సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. కుట్రకోణమే..: 'అమెరికా ఉపాధ్యక్షుడు భారత్‌లో, మోదీ విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ దాడి జరగడాన్ని కుట్రకోణంగానే భావించాలి. ఎన్డీయే కాదు వివిధ రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజలందరూ ఆలోచించి.. కేంద్రానికి సహకరించాలి. మొదట దేశం.. తర్వాతే ఏ వ్యక్తి అయినా, ఏ ప్రాంతమైనా. దేశానికే సవాలు విసిరేలా ఉగ్రమూకలు ఇలాంటి చర్యలకు పాల్పడినప్పుడు ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకొచ్చి ప్రతిఘటించాలి. ప్రపంచంలో అగ్రదేశాల సరసన భారత్ నిలిచింది. 2028 నుంచి మరింత వేగంగా అభివృద్ధి చెందనుంది. అందుకే కొన్ని శక్తులు దేశంలో అలజడి సృష్టించాలని కుట్రపన్నాయి' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రజల జీవితాలతో ఆడుకుని దేశాన్ని బెదిరించాలని, సమగ్రతను దెబ్బతీయాలనుకునే వాళ్లకు గట్టిగా సమాధానం చెబుతాం. అదే సమయంలో ప్రజలే పోలీసింగ్ చేయాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు పరిష్కారమవుతాయి. ఏపీలో సముద్ర తీరం ఎక్కువగా ఉంది. భద్రతపై దృష్టి పెట్టాం. అనుమానం వచ్చినప్పుడు ప్రజలు బాధ్యతగా ఇంటెలిజెన్స్, పోలీసు వర్గాలకు తెలియజేయాలి' అని చంద్రబాబు కోరారు.

# అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులు

అమరావతి : అమరావతి రాజధాని, సీఆర్డీయే పరిధిలో సుమారు రూ.లక్ష కోట్లతో చేపట్టే పనులకు మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సభాప్రాంగణంలో మూడు వేదికలు ఏర్పాటు చేస్తామని.. ఒక వేదిక మీద 30 మంది రాజధాని రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మందికి పైగా ప్రజలు తరలివస్తారని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు వివరించారు. ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. హెలిప్యాడ్ నుంచి సభావేదిక వరకు 1.1 కి.మీ. మేర ప్రధాని రోడ్ షో నిర్వహిస్తారని తెలిపారు. సభాప్రాంగణానికి చేరుకొనే కొన్ని రహదారులు, పార్కింగ్ ప్రాంతాలను గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్, సీఆర్డీయే, పోలీసు అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. వాహనాల రద్దీ నియంత్రణ, రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసులు ఇచ్చిన సూచనలను సీఆర్డీయే అధికారులకు తెలియజేసి గురువారం సాయంత్రానికల్లా పనులు పూర్తి చేయాలని..శుక్రవారం ఉదయం మళ్లీ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. అనంతరం సీఆర్డీయే ప్రాజెక్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధానిని అడవిలా మార్చారు...: వైకాపా ప్రభుత్వం మూడు ముక్కలాటతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని, రైతులు ఇచ్చిన భూములను అడవిలా మార్చిందని నారాయణ మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాజధానిలో పర్యటించిన చంద్రబాబు తక్షణం పనులను ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. రూ.41 వేల కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయి, పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ పనులను ప్రధాని మోదీ చేతుల మీదుగానే తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు' అని నారాయణ తెలిపారు. విజయవాడ పశ్చిమ బైపాస్‌నూ అందుబాటులోకి తెస్తున్నాం: 'అమరావతి నగరాన్ని జాతీయరహదారికి అనుసంధానం చేసే ఈ13, ఈ15, ఈ11, సీడ్ యాక్సిస్ రహదారి పనులు పూర్తిస్థాయిలో కానందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఇతర రహదారులను పరిశీలించాం. సభాప్రాంగణానికి చేరుకునేందుకు మంగళగిరి నుంచి రెండు, తాడేపల్లి నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజ్ నుంచి రెండు, తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రపురం నుంచి ఒకటి చొప్పున రహదారులున్నాయి. విజయవాడ పశ్చిమ బైపాస్ నుంచి కూడా రావడానికి ఏర్పాట్లు చేశాం. 11 చోట్ల వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు' అని మంత్రి వెల్లడించారు. మే రెండో తేదీ 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సభాప్రాంగణం వద్దకు వస్తారని, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుందని తెలిపారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచండి!

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. ఈ మేరకు తెలంగాణఫ్యూచర్ రెడీ పేరిట బుధవారం 45 ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ''అధికారులం వస్తాం.. తర్వాత మరోశాఖకు వెళతాం.. విద్యాశాఖకు మీరే శాశ్వత పెట్టుబడిదారులు'' అని అన్నారు. కళాశాల/సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య, నాణ్యమైన విద్య పెంచాలంటే సమస్యలను చెబుతున్నారని, అదే సమయంలో ఆదిలాబాద్ జిల్లాలో రంగయ్య తదితరులు ఎలా పెంచగలుగుతున్నారని ప్రశ్నించారు. వినూత్న బోధనా శైలులను అవలంబిస్తూ..చిత్తశుద్ధితో పేద పిల్లలకు చదువు చెప్పాలన్నారు. అంతకుముందు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం ఎలా తగ్గుతుందో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు.. కొందరు ఉపాధ్యాయులకు డిప్యుటేషన్లు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. పలు జిల్లాల్లో కలెక్టర్లు డీఈవోలు, ఎంఈవోలకు విద్యాశాఖ పనులు కాకుండా ఎన్నో ఇతర పనులు అప్పగిస్తున్నారన్నారు.




## వెంకట్రావుపేట.. జెడ్పీ హెచ్ ఎస్ లో వేసవి శిక్షణ శిబిరం

ఏప్రిల్ 23 తొగుట (సమయం న్యూస్) : వేసవి శిక్షణ సన్నాహక సమావేశమును జడ్.పి.హెచ్. ఎస్ వెంకటరావుపేట్ పాఠశాల నందు నిర్వహించడం జరిగింది వేసవి శిబిరంలో నాలుగవ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అంశాలు అందమైన చేతిరాత, చిత్రలేఖనం, నృత్యం, పాటలు, మంచి అలవాట్లు దేశభక్తి నైతిక విలువలు, NCC కరాటే, కనీస గణిత సామర్థ్యాలు స్పోకెన్ ఇంగ్లీష్ కవిత్వం పద్య గద్య రచనలు యోగ జీవన నైపుణ్యా లను విద్యార్థులకు నేర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నయీమకౌసర్ ,మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే .వెంకటయ్య ,జెడ్ .పి .హెచ్. ఎస్. వెంకటరావుపేట్ ఉపాధ్యాయ బృందం ,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం ,సి ఆర్ పి శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది. ఈ వేసవి శిక్షణ శిబిరం తేదీ 24/04/2025 నుండి తేదీ 30/04/2025 వరకు జరుగును కావున ప్రైవేటు ,ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుండి 9వ తరగతులు చదువుకుంటున్న విద్యార్థులందరూ ఈ గొప్ప అవకాశమును వినియోగించుకోగలరు.



## పోలీస్ నిర్బంధం లో జిన్నారం

* **శివుడి మట్టి విగ్రహాన్ని ధ్వంసం చేసిన మదర్సా విద్యార్థులు**
* **ఆందోళన చేపట్టిన హిందూ సంఘాలు, ప్రజలు**
* **జిన్నారంలో 163 సెక్షన్ అమలు**
* **ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు**

జిన్నారం, ఏప్రిల్ 23, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో శివుడి మట్టి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. మదర్సా లో చదివే కొంతమంది విద్యార్థులు ఈ ఘటనకు పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపిస్తూ మదర్స ముందు పెద్ద సంఖ్యలో ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనలో మండలంలోని హిందూ సంఘాలు, ప్రజలు పాల్గొని ఘటనకు పాల్పడిన విద్యార్థులను, వారి వెనుక ఉండి నడిపిస్తున్న మతోన్మాద శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో గ్రామంలోకి పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు మోహరించి ఆందోళనకారులను చెదరగొట్టారు. జిన్నారం లో 163 సెక్షన్ ను అర్ధరాత్రి నుంచి అమలు చేస్తున్నారు. గ్రామం నలుదిక్కుల పోలీస్ లు రహదారులపై వుండి, జిన్నారానికి వస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. హిందూ, ముస్లింల మధ్య ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గ్రామం నిర్మానుష్యంగా మారింది. ఎవరైనా అవాంఛనీయ ఘటనకు పాడుపాడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## కాంగ్రెస్ కరెంటుపై నమ్మకం లేకనే సభలో జనరేటర్లు

* **ప్రజలు ఏ కష్టమొచ్చినా తెలంగాణభవన్‌కు వస్తున్నారు: కేటీఆర్**

భీమదేవరపల్లి : 'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే కరెంటుపై నమ్మకం లేదు. అందుకే రజతోత్సవ సభకు నిరంతర విద్యుత్తు కోసం 200 జనరేటర్లు ఏర్పాటు చేసుకుంటున్నాం' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస చరిత్రలో రజతోత్సవ సభ ఓ మైలురాయిగా నిలిచిపోతుందని చెప్పారు. పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం వినేందుకు లక్షల మంది తరలివస్తారన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో భారాస రజతోత్సవ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సంస్థగా ఏర్పడి 14 ఏళ్లు ప్రజలను సమీకరిస్తూ అంబేడ్కర్ చెప్పినట్టుగా బోధించు... సమీకరించు.. పోరాడు ధర్మాన్ని పాటిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. ప్రజలు ఏ కష్టమొచ్చినా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వస్తున్నారని వివరించారు. హైడ్రా , మూసీ, లగచర్ల బాధితులతోపాటు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు జనతా గ్యారేజీలాగా గులాబీ జెండా మాత్రమే న్యాయం చేస్తుందని నమ్ముతున్నారని చెప్పారు.

# చెట్టు కింద కూర్చుని ప్రజా సమస్యలు తెలుసుకుంటూ..
# నిరసన వ్యక్తం చేసిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మేడ్చల్ మల్కాజిగిరి. ఏప్రిల్ 24 సమయం న్యూస్ :** గ్రేటర్ హైదరాబాదు లోని మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లేకపోవడంతో మల్కాజ్గిరి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వద్ద మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు చెట్టు కింద టేబుల్ కుర్చీ వేసుకొని ప్రజలు ఇచ్చే అర్జీలను ప్రజా సమస్యలను తెలుసుకుంటూ , సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు . ప్రజలు అనేక సమస్యలతో సతమత అవుతున్న తరుణంలో వారి అర్జీలను తెలుసుకుంటూ ఇందులో ముఖ్యంగా ప్రజా పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీ గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్లలోపు కరెంటు బిల్లు సబ్సిడీ , నెరవేరకపోవడం, వికలాంగులకు సదరం సర్టిఫికెట్ అందించడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్కీముల ద్వారా వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కోవడం , అర్హులైన పేదలకు పెన్షన్లు అందకపోవడం , ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డులు రావడంలేదని, ఇందిరమ్మ ఇండ్లు ఎప్పుడు వస్తాయని, రాజీవ్ యువ వికాస్ పథకాలు ఎప్పుడు అందుతాయని. ప్రజలు అడుగుతున్నారని ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే దాటవేత ధోరణిలో సమాధానాలు చెబుతున్నారని మరి ముఖ్యంగా కెసిఆర్ గారి ప్రభుత్వంలో దాదాపు అన్ని నియోజక వర్గాలలో ఎమ్మెల్యే గారి క్యాంప్ ఆఫీస్ నిర్మించి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గారిని కలిసి విన్నవించుకునేందుకు ఏర్పాటు చేశారు కానీ మల్కాజిగిరి నియోజకవర్గం లో ఇంతవరకు క్యాంప్ ఆఫీస్ లేకపోవడంతో కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్తే జిహెచ్ఎంసి కమిషనర్ గారికి అక్కడి నుండి అడిషనల్ కమిషనర్ (ఎస్టేట్స్) జోనల్ కమిషనర్ నుండి డిప్యూటీ కమిషనర్ గారికి తెలియజేయాలని ఈ విధంగా తిప్పుతున్నారు తప్ప పనులు మాత్రం చేయడం లేదు అదేవిధంగా ఎమ్మెల్యే గారికి ప్రభుత్వ వ్యక్తిగత సహాయకున్ని (P.A) కేటాయించాలని అసెంబ్లీ సెక్రటరీ, జి ఏ డి, అధికారులకు తెలియజేసిన స్పందన లేకపోవడం అందుకే మల్కాజ్గిరి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు చెట్టు కింద కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్నాము . మల్కాజ్గిరి నియోజకవర్గం ప్రజల సమస్యలు ఎక్కడ ఉంటే ఆ సర్కిల్ కార్యాలయంలో అవసరమైతే కలెక్టర్ గారి కార్యాలయం సమీపంలో కూర్చొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్ , మురుగేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి ,జెఎసి వెంకన్న ,జీకే హనుమంతరావు, అమినుద్దీన్, రాము యాదవ్, చిన్న యాదవ్, శివకుమార్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబర్ పెట్ డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

* **జన్మదిన వేడుకలో పాల్గొన్న అంబర్ పేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ అంబర్ పేట డివిజన్ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు**
* **చౌరస్తాలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు**

**అంబర్ పేట, ఏప్రిల్,23 (సమయం న్యూస్):** అంబర్ పేట కార్పొరేటర్ ఇ. విజయ కుమార్ గౌడ్ గారి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు వివిధ పార్టీల నాయకుల మధ్య ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా పటేల్ నగర్ చౌరస్తాలో ఉచిత మెడికల్ క్యాంపును, కంటి చికిత్స శిబిరాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గారు హాజరై మెడికల్ క్యాంపును ప్రారంభించారు, ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంబర్ పేట డివిజన్ ప్రజల ప్రేమను జీవితాంతం మరువలేనిదని ప్రజలకు సేవ చేసుకునే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు, ఎమ్మెల్యే గారి సహాయ సహకారాలతో డివిజన్ అనేక రకాలుగా అభివృద్ధి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, లవంగు ఆంజనేయులు నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు మైనార్టీ నాయకులు స్థానిక బస్తి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలి

: **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

సంగారెడ్డి, ఏప్రిల్ 23 (సమయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా, కంది, మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో కొత్త గా నిర్మించిన అదనపు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని, వారికి ఏకరూప దుస్తులు పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవీంధర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది

* **మాసాయిపేట మండల కేంద్రంలో**
* **జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి**
* **పిల్లలతో భోజనం చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్, ఏప్రిల్ 23 (సమయం న్యూస్) : విద్యాభివృద్ధికి రాష్ట్రం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం మాసాయిపేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శించి పాఠశాలలోని వంట గదులు, వాష్ రూంలలో పరిశుభ్రత ను పరిశీలించారు. స్టోర్ రూంను, స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. సరుకుల సరఫరాలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతి గదులలో 9వ తరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల కు క్వాలిటీ విద్య అందేలా చూడడంతో విద్యకు ప్రాధాన్యతనిస్తేనే సమాజం బాగుపడుతుందనీ...ప్రతి కుటుంబం పరిశుభ్రత, విద్యార్థుల భద్రతపై దృష్టిసారించాలని తెలిపారు విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచికరమైన భోజనం వడ్డించాలి. సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, తాసిల్దార్ జ్ఞాన జ్యోతి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు





## రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దు

* **తొగుట సి ఐ లాతీఫ్ .**
* **సాధ్యమైనంత వరకు రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దు**
* **తొగుట సిఐ లతీఫ్**

**ఏప్రిల్ 23, తొగుట (సమయం న్యూస్):** తొగుట సిఐ లతీఫ్ మాట్లా డుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవుచున్నారు. కొంతమంది గాయాలపాలు అవుతున్నారు, బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలి, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు, రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోవడం జరుగుతుంది. రోడ్లపై ధాన్యం పోయవద్దని సూచించారు.



## పండుగ వాతావరణాన్ని తలపించిన రైతు మహోత్సవం వేడుక



* **ఉత్సాహంగా పాల్గొన్న అన్నదాతలు**
* **ఆధునిక సాగుపై సలహాలు, సూచనలు అందించిన శాస్త్రవేత్తలు, నిపుణులు**
* **విశేషంగా ఆకట్టుకున్న వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్లు**
* **నూతన సాగు పద్ధతులపై అనుభవాలను పంచుకున్న ఆదర్శ రైతులు**
* **సందేహాలను నివృత్తి చేసుకున్న ఐదు జిల్లాల రైతులు**
* **కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్ల సందర్శన**

**నిజామాబాద్, ఏప్రిల్ 23 (సమయం న్యూస్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవం వేడుక బుధవారం సాయంత్రం నాటితో ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేయగా, నిజామాబాద్ తో పాటు కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల ఐదు జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130 కు పైగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను, ఆధునిక సాగు పరికరాలు, అధిక దిగుబడులను అందించే వంగడాలు, మేలు జాతి పాడిపశువులు తదితర వాటిని స్టాళ్లలో ప్రదర్శించగా, రైతులు ఎంతో ఆసక్తితో తిలకించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ, ఇతర వ్యవసాయ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు మూడు రోజుల పాటు కొనసాగిన వర్క్ షాపులో ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఏ.జానయ్య, వివిధ విభాగాల అధిపతులు శ్రీలత, అంజయ్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకృష్ణ, శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, రాజశేఖర్, విజయ్, స్వప్న తదితరులు వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన మెళుకువలు, సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, భూసారం పెంపుదల, అధిక దిగుబడులను అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను సాధించేందుకు అవలంభించాల్సిన పద్ధతులు, వాణిజ్య పంటల ఎంపికకు పరిశీలించాల్సిన అంశాలు తదితర విషయాలపై సెషన్ల వారీగా రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు సైతం రైతు మహోత్సవం వేదిక ద్వారా తమ అనుభవాలు పంచుకున్నారు.

* **స్టాళ్లను సందర్శించిన కలెక్టర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు**

కాగా, చివరి రోజైన బుధవారం జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు రైతు మహోత్సవ వేదిక, స్టాళ్లను సందర్శించారు. రైతులు, రైతు ప్రతినిధులతో మమేకం అయ్యి మూడు రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమం గురించి వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మహోత్సవ వేడుక నిర్వహించడం పట్ల హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. సాగు విషయాలలో అనేక నూతన విధానాలు, సరికొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకోగలిగామని, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలైన అభ్యుదయ రైతుల అనుభవాలతో పాటు వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, సైంటిస్టులు, నిపుణులు తమ పరిశోధనా అనుభవాలను, నేటి సామాజిక వ్యవసాయక స్థితిగతులను మేళవిస్తూ అనేక అంశాలపై అవగాహన కల్పించారని, పంటల సాగులో నూతన ఒరవడికి, అధిక దిగుబడుల సాధనకు ఈ మేళా ఎంతగానో దోహదపడుతుందని గట్టి నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలో రైతు మహోత్సవ వేడుక నిర్వహించడం వల్ల స్థానిక రైతులతో పాటు జిల్లాకు అనుకుని ఉన్న కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల రైతులకు కూడా ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు, సామాజిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాగు రంగంలో మెళకువలు, యాంత్రీకరణ తదితర అంశాలపై సైంటిస్టులు, నిపుణులు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అభ్యుదయ రైతులు వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు అనుబంధ రంగాల ఉత్పత్తులకు సంబంధించిన సుమారు 130 కు పైగా స్టాళ్లను రైతులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ, ప్రయోగాత్మక పరిశీలన ద్వారా అవగాహనను పెంపొందించుకోగలిగారని కలెక్టర్ తెలిపారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను, నూతన సాగు విధానాల గురించి రైతులు గ్రామాలలో సహచర రైతులకు తెలియజేస్తూ వారిని కూడా అధిక దిగుబడుల సాధన దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ రైతు మహోత్సవానికి ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచామని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా శిబిరం

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 23 (సమయం న్యూస్) :** ఉద్యోగ నిర్వహణలో శిక్షణ లో నేర్చుకున్న విషయాలు మరింత మెరుగ్గా పని చేసేందుకు ఉపయోగ పడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. బుధవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ కార్యాలయంలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ఈ శిక్షణ



కార్యక్రమం తీసుకోవడం వల్ల వారికి తెలియని విషయాలు తెలుసుకోవచ్చని. ముఖ్యంగా రోజు వారి ఉద్యోగంలోని సవాళ్లను అధిగమించేందుకు ఈ శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రిసోర్స్ పర్సన్స్ పి.కృష్ణ రిటైర్డ్ డీపీఓ, అడ్డాకల్ ఎంపిడిఓ విజయ్ కుమార్,, జడ్చర్ల మండలం ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలు శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్న 35 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు సమాచార హక్కు చట్టం 2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, గ్రామ సభ సమాచార హక్కు, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018, వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి పార్థ సారథి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ హనుమంతు, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాతంగా ముగిసిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్

* **రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి**
* **78.57 శాతం పోలింగ్**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (సమయం న్యూస్) : హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, మధ్యాహ్నం 2 గంటల వరకే 78.57 శాతం ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 112 మందిలో 88మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 112 ఓటర్లలో ఎక్స్ అఫిషియో మెంబర్ 31 కాగా, అందులో 22 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81 మంది కార్పొరేటర్ల లో 66 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు 37.51 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12 గంటల వరకు 77.68 శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 78.57 శాతం పోలింగ్ నమోదు అయ్యింది సాయంత్రం 4 గంటల వరకు 78.57 శాతం నమోదు అయ్యింది. ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ రిటర్నింగ్ అధికారితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను రిసెప్షన్ సెంటర్ కు బందోబస్తుతో తీసుకువచ్చిన పిదప పరిశీలన చేసిన తర్వాత స్ట్రాంగ్ రూం లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. ఈ నెల 25న ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో నిర్వహించడం జరుగుతుంది.











# భూభారతితో ధరణి దరిద్రాన్ని పోగొట్టాం

- **ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం**
* **భూభారతి చట్టం అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్**
* **లబ్ధిదారురాలి ఇంట్లో సన్నబియ్యం భోజనం చేసిన మంత్రి**

సిద్దిపేట, ఏప్రిల్ 23 : భూభారతిని ప్రారంభించి ధరణి దరిద్రాన్ని పోగొట్టామని, ప్రభుత్వ భూము లను ఆక్రమించుకున్నవారి నుంచి భూములను స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా కోహెడలో భూభారతి చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూములను గుంజుకొని, వాటిని అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. "పరంపోగు భూములు, ప్రభుత్వ భూములు తీసుకున్న వారి లెక్కలు తీయండి. వాటిని అభివృద్ధి కోసం ఉపయోగించండి. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే, ప్రభుత్వం ఆ భూమిని గుంజుకుంటుంది. రాజకీయాలకు అతీతంగా ఆ భూములను అభివృద్ధి పనుల కోసం ఉపయోగిస్తాం. భూములపై ఏమైనా సమస్యలు ఉంటే వచ్చి అడగండి, సలహాలు ఇవ్వండి. ప్రజాస్వామ్యంలో మనమందరం భాగస్వాములం" అని మంత్రి అన్నారు. ధరణి చట్టం కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకే 'భూ భారతి' చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. "ధరణి ఒక దరిద్రమైన చట్టం. దాని కారణంగానే లక్షల మంది పిటిషన్లు పెట్టుకున్నరు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు ఉండేవి. ఎవరి భూమి ఎవరు కొనుక్కుంటున్నారో పూర్తి వివరాలు అందులో ఉండేవి. కానీ, ధరణి కారణంగా ఈ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. మా నాన్న భూమి నా పేరు మీదకు మార్చుకోవడానికి కూడా రికార్డుల్లో కనిపించడం లేదు" అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. భూభారతి చట్టం ద్వారా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా, హద్దులతో సహా అన్ని రకాల భూ వ్యవస్థకు ఒక పద్ధతి వస్తుందన్నారు. భూ హక్కులపై ఆధార్ తరహాలో 'భూధార్' తీసుకొస్తున్నామని, గ్రామాల్లో చదువులేని వారికి కూడా భూములపై అవగాహన ఉంటుందని మంత్రి అన్నారు. నిజాం ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఉన్న భూ చట్టాలపై అధ్యయనం చేశామని, వాటిలో ధరణి అత్యంత దరిద్రమైన చట్టమని వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేయాలని అనేక కార్యక్రమాలు చేపడుతోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.





* **సన్న బియ్యం లబ్ధిదారురాలి ఇంట్లో భోజనం చేసిన మంత్రి**

కోహెడ మండల కేంద్రంలో సన్న బియ్యం లబ్ధిదారురాలు తలారి మల్లవ్వ ఇంట్లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి, ఇతర అధికారులు భోజనం చేశారు. సన్న బియ్యం పథకం తమ కుటుంబానికి ఎంతో మేలు చేస్తోందని మల్లవ్వ కుటుంబ సభ్యులు మంత్రితో అన్నారు. రేకుల ఇంట్లో ఉంటున్న వారి పరిస్థితిని చూసిన మంత్రి మల్లవ్వ పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ఉషోదయ ఉదయ కిరణాలు

**బోధన్ పట్టణం, 23 ఏప్రిల్, సమయం న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డ్ వారిచే 2025 మార్చ్ లో నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించగా, ఇంటర్మీడియట్ బోర్డ్ ఫలితాలను విడుదల చేయడం జరిగింది. అందులో భాగంగా బోధన్ పట్టణంలోని ఉషోదయ విద్య సంస్థల విద్యార్థులు ఉదయ కిరణాలుగా విజయదుందుభి మోగించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1000 మార్కులకు గాను ఎంపీసీ గ్రూప్ నుండి ఎం.హర్షిత 995, సిహెచ్.పూజిత 993, ఎం.సాయి చరణ్ 992, కే.ఓంకార్ 991 ఎం.భాగ్యశ్రీ 990, బైపిసి గ్రూప్ నుండి ఆయేషా జరీన్ 991, అధిభ అమ్రిన్ 989, సల్మా తబస్సుం 988, సీఈసీ గ్రూప్ నుండి అమీనా బేగం 977, ఎంఈసి గ్రూప్ నుండి ఎండి యూసుఫ్దీన్ 929 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ గ్రూప్ నుండి 470 మార్కులకు గాను, కె.హర్షిత 468, అదీనా నాజ్ 466, ముదస్సిర్ 464, బైపీసీ గ్రూప్ 440 మార్కులకు గాను ఖంసా బతుల్ 437, అఫీయా బేగం 436, తహూర తక్మీన్ 435, సిఇసి గ్రూప్ నుండి 500 మార్కులకు గాను ఫిరదౌస్ జహాన్ 491, జి.సురాజ్ 481, ఎంఈ సి గ్రూప్ నుండి 500 మార్కులకు గాను ఏ.శాలిని 487, హుమిరా జహాజ్ 486 మార్కులు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల కళాశాల చైర్మన్ సూర్య ప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, ప్రిన్సిపల్స్ ఆనందారెడ్డి, ప్రసాద్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలల చైర్మన్ సూర్య ప్రకాష్ డైరెక్టర్లు దుష్యంత్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణం గా ఉందని, విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా నిలపడానికి మా అధ్యాపక అధ్యాపకేతర బృందం అహర్నిశలు పనిచేస్తుందని, అలాగే మాపై నమ్మకం ఉంచి తమ పిల్లలను మా కళాశాలకు పంపిస్తున్న తల్లిదండ్రులకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా మా కళాశాల సంస్థలు ముందడుగు వేస్తాయని అన్నారు.


సిహెచ్.పూజిత
MPC-II 993/1000


ఎం.హర్షిత
MPC-II 995/1000


ఆయేషా జరీన్
BIPC-II 991/1000


అమీనా బేగం
CEC-II 977/1000


కే.హర్షిత
MPC-I 468/470


ఖాన్సా బతుల్
BIPC-I 437/440


ఫిర్దోస్ జహాన్
CEC-I 491/500


ఏ శాలిని
MEC-I 487/500



## ఇందూర్ ఎంబీఏ కళాశాలలో జాబ్ మేళ

**: 17 మందికి ఉద్యోగ అవకాశాలు**

బోధన్ పట్టణం, 23 ఏప్రిల్ 2025: బోధన్ పట్టణంలోని ఇందూర్ ఎంబీఏ కళాశాలలో ఒక ముఖ్యమైన జాబ్ మేళను నిర్వహించారు. ఈ కార్యక్రమం నిజామాబాద్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు, పాఠశాల నిర్వాహకులు కొడాలి కిషోర్, ప్రిన్సిపాల్ డాక్టర్. డి.మదన్ మోహన్ నేతృత్వంలో జరిగింది. అధ్యాపకుల సహకారంతో ఈ మేళను విజయవంతంగా నిర్వహించారు. టాస్క్ నిర్వాహకులు హన్మంత్ సమన్వయంతో ప్రముఖ బ్యాంకులు యాక్సెస్ బ్యాంక్ మరియు హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ తమ ఇంటర్వ్యూలను నిర్వహించాయి. వివిధ కళాశాలల నుండి వచ్చిన సుమారు 200 మంది విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియ అనంతరం మొత్తం 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందూర్ ఎంబీఏ కళాశాల యాజమాన్యం ఈ విజయాన్ని హర్షంగా స్వీకరించింది. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా జరిగే ఇలాంటి కార్యక్రమాలు వారికీ భవిష్యత్తులో మంచి మార్గాన్ని చూపిస్తాయని తెలిపారు.

# మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 155వ జయంతి

*** బోధన్‌లో ఘనంగా నివాళులు**

**బోధన్ పట్టణం, ఏప్రిల్ 23, సమయం న్యూస్:** సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో మహోపాధ్యాయుడు, విప్లవ నాయకుడు కామ్రేడ్ వ్లాదిమిర్ లెనిన్ 155వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య మాట్లాడారు. 1917లో రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసిన గొప్ప మార్క్సిస్టు నాయకుడు లెనిన్ అని కొనియాడారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే లెనిన్‌కు అర్పించే నిజమైన నివాళి అని వివరించారు.




*** లెనిన్ స్ఫూర్తితో నూతన సమాజ నిర్మాణం**

వరదయ్య మాట్లాడుతూ, "లెనిన్ మార్క్సిజాన్ని ఆచరణలో అమలు చేసి చూపిన మహానాయకుడు. ఆయన ఆకాంక్షించిన దోపిడీ లేని సమాజ నిర్మాణమే నిజమైన సోషలిజం లక్ష్యం," అని చెప్పారు. రష్యా నేడు ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదగడంలో లెనిన్ వేసిన సోషలిస్టు పునాది పాత్ర కీలకమని చెప్పారు. లెనిన్ జయంతి రోజే సీపీఐ (ఎంఎల్) పార్టీ ఆవిర్భవం జరిగినట్లు వివరించారు. నగ్జల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయల్లో జరిగిన విప్లవ పోరాటాలను గుర్తు చేశారు. లక్షల ఎకరాల భూములు ఆదివాసీలకు, దళితులకు పంచిన ఘన చరిత్రను ప్రజల ముందు ఉంచారు.

*** పౌరులు శోషక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి**

బడా బూర్జువా, దళారీ పాలకులకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కమ్యూనిస్టు లెనిన్ స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక విప్లవానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, పేట సాయిలు, బండారి గంగాధర్, సాయా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ ఎస్ క్రమబద్ధీకరణ వేగవంతం చేయండి

*** అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

నిర్మల్ ఏప్రిల్ 23 (సమయం న్యూస్): జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 6277 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులు క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించారని జిల్లా స్థానిక సంస్థల అదన కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 44 వేల 602 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఆమోదం పొందిన దరఖాస్తుదారులు 6277 మంది రిజిస్ట్రేషన్ రుసుమును చెల్లించి తమ దరఖాస్తులను క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు.



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో రుసుములు చెల్లించినవారిలో ఐదుగురిని ఎంపికచేసి సంబంధిత అధికారులతో కలిసి రేపు మధ్యాహ్నం 3 గంటలకి కలెక్టరేట్ లో సన్మానించ నిర్ణయించామని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



## ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

*** జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 సమయం న్యూస్:** ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించి మందమర్రి తెలంగాణ ఆదర్శ పాఠశాల అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఎంపిసి లో 2. జి అనూష (987), టి హర్షిత (982), బిపిసి లో పి వైశాలి (986), ఏం హసీని (973), సిఈసి ప్రతిమా దేవి (932), కె శ్రీనిధి (927) మార్కులు సాధించారని తెలిపారు. భవిష్యత్తులో వార్షిక పరీక్షల ఫలితాలలో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని ఆకాంక్షించార. మందమర్రి తెలంగాణ ఆదర్శ పాఠశాల అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సారా తస్నీమ్, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజీవ్ యువ వికాసం పథకం

# లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు చేపట్టాలి

*** హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

హన్మకొండ ఏప్రిల్ 623 (సమయం న్యూస్) : హనుమకొండ: రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక తర్వాతనే యూనిట్ల కు ప్రభుత్వం నుండి వచ్చే రాయితీని బ్యాంకు ద్వారా మంజూరు అయ్యేవిధంగా అధికారులు బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా పి. ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో బిసి, ఎస్సీ, ట్రైబల్, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా దాదాపు 63 కోట్ల రూపాయలను ఈ పథకం ద్వారా జిల్లాలోని వివిధ యూనిట్లను నెలకొల్పేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాను ఎంపీడీవోలు అందజేసేటప్పుడే బ్యాంకు ఖాతాలను కూడా జత చేసి అందించాలన్నారు. మండల స్థాయి ఎంపిక కమిటీ మే 10నాటికి లబ్ధిదారులు ఎంపిక జాబితా ను సమర్పించాలన్నారు. మండల స్థాయిలో ఐదు రోజుల్లో సమన్వయ సమావేశాన్ని నిర్వహించుకోవాలన్నారు. రాజీవ్ యువవికాసం పథకంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని అధికారులకు, బ్యాంకర్లకు సూచించారు. ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక తర్వాత వారు ఎంచుకున్న యూనిట్లకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకంపై ఆయా మండలాల పరిధిలోని ఎంపీడీవోలతో బ్యాంకర్లు సమావేశం కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్ రెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మురళీధర్ రెడ్డి, ప్రేమకళ, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 25న మినీ జాబ్ మేళ

*** జిల్లా ఉపాధి శిక్షణ అధికారి రవి కృష్ణ**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 సమయం న్యూస్:** జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గల మిమ్స్ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి శిక్షణ అధికారి రవి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ లో మంచిర్యాల పరిసర ప్రాంతాలలో 30 బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు భర్తీ చేసేందుకు 18 నుండి 30 సంవత్సరాల వయస్సు, డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ కంపెనీలో మంచిర్యాల పరిసర ప్రాంతాలలో 30 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, 10 గ్రూప్ లీడర్స్, 10 టీమ్ మేనేజర్ పోస్టులకు 20 సంవత్సరాల వయస్సు, ఎస్ఎస్సి, ఇంటర్, డిప్లొమా అండ్ బిఎస్సి అగ్రికల్చర్, ఎంబిఏ మార్కెటింగ్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 9666155347, 9640731731, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

**: పట్నం నరేందర్ రెడ్డి**

నారాయణపేట జిల్లా, కొడంగల్ నియోజకవర్గం : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయ వంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. గుండుమాల్ మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పోస్టర్ విడుదల చేశారు. కేసీఆర్ ఆధ్వర్యంలో స్వరాష్ట్రం కోసం అలు పెరుగని పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగంగా టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా ఆవిర్భవించిందన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని రైతులకు బడుగుబలహీనవర్గాలకు, దళితులకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలిపిన ఘనత కేసీఆర్‌దన్నారు. ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ సభలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు భవిష్యత్ గురించి దిశానిర్దేశం చేయనున్నారని, సభకు తరలి వెళ్లేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. 27 వ తేదీన ఉదయం 6:00 గంటలకు ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరావేసి భారీగా తరలి వెళదాం.. బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక





# నిబంధనలు పాటించని క్రషర్, క్వారీలపై చర్యలు

* **జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్స్పెక్టర్ సైదులు**

జిన్నారం, ఏప్రిల్ 23, సమయం న్యూస్: నిబంధనలు పాటించని క్రషర్, క్వారీలపై చట్టరీత్య చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్స్పెక్టర్ సైదులు తెలిపారు. మాదారం గ్రామ పోరాట కమిటీ ఇటీవల కలెక్టరేట్ ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారి బుధవారం మాదారం గ్రామ గ్రామ పరిధిలోని కంకర క్వారీలు, క్రషర్లను పరిశీలించారు. క్రషర్, క్వారీలకు సంబందించిన పత్రాలను తీసుకొని సంగారెడ్డి మైన్స్ ఆఫీస్ కు రిపోర్ట్ చేయాలని సూచించారు. మాదారం గ్రామ పోరాట కమిటీ సభ్యులు గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ గురించి ఇన్స్పెక్టర్ సైదులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోరాట కమిటీ అధ్యక్షుడు ఎస్ విజయ్ గౌడ్,జనరల్ సెక్రెటరీ రమణ సింగ్,దాసరి సాయికుమార్,వికాస్ సింగ్, అనిల్ కుమార్, నితిన్, గోపి, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో భూసమస్యల పరిష్కారం

* **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మందమర్రి, ఏప్రిల్ 23 సమయం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన అంశాలు, హక్కులతో భూసమస్యలు పరిష్కరించబడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మండలంలోని సండ్రోన్ పల్లి వద్ద గల రైతు వేదికలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె అనిత, మండల తహశీల్దార్ సతీష్ కుమార్, మండల ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్, పట్టణ మున్సిపల్ కమీషనర్ తుంగపిండి రాజలింగు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, చట్టంలోని ప్రతి అంశాన్ని, ప్రతి హక్కును ప్రతి రైతు పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. ఈ చట్టంలో హక్కులు, రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో



సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం జరుగుతుందన్నారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని, భూధార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణతో పాటు మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అవకాశం వంటి అంశాలను పొందు పర్చడం జరిగిందని వివరించారు. భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏప్రిల్ 30 వరకు జిల్లాలోని అన్ని మండలాలలో సదస్సులు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఇందు కొరకు కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేసిన మండలంలో జూన్ 2 వరకు సమస్యలు పరిష్కరించి, మిగిలిన మండలాలలోని సమస్యలను గుర్తించి, ఆగస్టు 15 లోగా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, సర్వే ప్రక్రియలో సంబంధిత సర్వేయర్లు, ఇతర అధికారుల నియామకంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని, రైతులకు పట్టాభూమి, లావుని పట్టా, ఇతర రకాల భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ ఆదేశాలు, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, టైటిల్, పొసెషన్ సంబంధిత సమస్యలు, కోర్టులో కొనసాగుతున్న కేసులను మినహాయించి, మిగిలిన వాటిని పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. అనంతరం మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతు సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# స్కూళ్లకు సెలవు తల్లిదండ్రులు మీ పిల్లలు జాగ్రత్త

కంగ్టి,23ఏప్రిల్ (సమయం న్యూస్) : తెలుగు రాష్ట్రాల్లో స్కూళ్లు ఇవాళ చివరి పని దినంగా ముగిసింది.

పిల్లలకు ప్రోగ్రెస్ కార్డు అందించారు.రేపటి నుండి జూన్11 వరకు వేసవి సెలవులు.

ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు ఉపశమనం లభించునుంది. తిరిగి జూన్ 12న పాఠశాలలు రీఓపెన్ అవుతాయి.

తల్లిదండ్రులు మీ పిల్లలు జాగ్రత్త....

- స్నేహితులతో కలిసి దూర ప్రయాణాలకు వెళ్లనీయకండి.
- చెరువులో,కాలువల్లో ఈతకు వెళ్ళనీయకండి.
- మీ పిల్లలకు చేతికి మొబైల్ ఫోన్లను ఇవ్వకండి.
- మరీ ముఖ్యంగా పిల్లల చేతికి బైక్ ఇవ్వకండి.
- సాంప్రదాయాలు,సంస్కృతి,కథలు తెలిపే ప్రయత్నం చేయండి.
- ఎండలు మండిపోతున్నాయి పిల్లలను బయట తిరగనివ్వకండి.

తల్లిదండ్రులారా ఇక మీ పిల్లల బాధ్యత మీదే జాగ్రత్త.

# ఉగ్రవాదుల తయారీ కేంద్రాలుగా మదర్సాలు

* **వీహెచ్‌పీ ఆల్ ఇండియా మఠ మందిర్ ప్రముఖ్ రామరాజు**
* **మదర్సాలపై నిఘాను పెంచాలని డిమాండ్**
* **వీహెచ్‌పీ నాయకుల అరెస్టు**

జిన్నారం, ఏప్రిల్ 23, సమయం న్యూస్ : మదర్సాలపై రాష్ట్ర ప్రభుత్వం నిఘాను పెంచాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. జిన్నారంలో శివుడి విగ్రహం ధ్వంసంతో ఏర్పడిన ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు 163 సెక్షన్‌ను విధించి చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. బుధవారం విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా మఠ మందిర్ ప్రముఖ్ రామరాజు, ఆల్ ఇండియా అధికార ప్రతినిధి శశిధర్, రాష్ట్ర ధర్మ ప్రచార ప్రముఖ్ సుభాష్ చంద్ర వీహెచ్‌పీ కార్యకర్తలతో కలిసి జిన్నారం వస్తుండగా పెద్దమ్మగూడెం చౌరస్తాలో అడిషనల్ ఎస్‌పీ సంజీవ్ రావు, పోలీసులు అధికారులు, సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ మదర్సాలో మత విద్వేషాలను రెచ్చగొట్టే పాఠాలు భోదిస్తూ ఉగ్రవాదులను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. మదర్సాలపై పోలీసులు నిఘా పెంచాలని అన్నారు. హిందువులపై ఏమైనా దాడులు జరిగిన, కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి



చేసిన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీహెచ్‌పీ నాయకులను పోలీసులు పటాన్ చెరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మనోజ్, శశి, శ్రీకాంత్, వి హెచ్ పి కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు శ్రీ సాయి దత్తాత్రేయుల, విగ్రహాల ఊరేగింపు

శివంపేట ఏప్రిల్ 23 (సమయం న్యూస్) : శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ పౌడర్ చైర్మన్ శ్రీ జిన్నారం పెద్ద గౌని రమాదేవి శివకుమార్ గౌడ్ నిర్మించిన శ్రీ మహా దత్తాత్రేయ పంచాయతనం షిరిడీ సాయి దేవాలయాల లో వెలసే విగ్రహ మూర్తుల ఊరేగింపు గురించి* శ్రీనివాస్ గౌడ్ శ పీఠం ట్రస్ట్ సభ్యులు మాజీ సర్పంచ్ గూడూరు గ్రామపంచాయతీ *మాట్లాడుతూ జైపూర్ నుండి బయలు దేరిన శ్రీ దత్తాత్రేయ స్వామి సహిత విగ్రహాలు గురువారం రోజున శ్రీ గురు పీఠంకు చేరుతున్నందున. సాయంత్రం 6గం.లకు శివ్వంపేట బస్టాండ్ నుండి ప్రారంభమయ్యే ఊరేగింపులో మహిళలు పురుషులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాలని



భక్తులందరూ శ్రీ మహా దత్తాత్రేయ స్వామి పరంపర గురువులందరినీ భక్తిశ్రద్ధలతో సుస్వాగతం పలకాలని ముఖ్యంగా గూడూరు మరియు శివంపేట గ్రామ ప్రజలందరూ రాజకీయాలకతీతంగా భగవంతుని ముందు అందరి సమానులనే ఉద్దేశంతో. ఈ ఊరేగింపులో పాల్గొనాలని, పరంబ్రహ్మ స్వరూపమైన శ్రీమన్నారాయణ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల రూపంలో ముగురమ్మల కలయిక దత్తాత్రేయుడుగా అవతరించి సకల లోకాల్లో నిరంతరం సంచరిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నారు. మన పూర్వజన్మ సుకృతం వల్ల దత్తాత్రేయ స్వామి కలియుగ అవతారులు అందరూ మన గ్రామానికి రావడం మనం ఏ జన్మలో చేసుకున్న పుణ్యఫలం. భక్తులందరూ కుటుంబ సమేతంగా ఆ దత్తాత్రేయని ఆశీస్సులు పొందాలని. ఈ సదవకాశాన్ని మండలంలోని భక్తులందరూ వినియోగించుకోవాలని స్వామివారికీ ఊరేగింపుగా నేడు గూడూర్ పవిత్రమైన సాయిబాబా దత్తాత్రేయ స్వామి ఆలయానికి తీసుకురావడం జరుగుతుంది. కాబట్టి భక్తులందరం కలిసి ముఖ్యంగా మహిళలు మంగళ హారతులు, నీళ్ల చాకలు పెడుతూ పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి వాటిని నూతన ఆలయం వద్ద పెట్టడం జరుగుతుంది. తర్వాత వాటిని ప్రతిష్ట సమయము తెలుపడం జరుగుతుంది. కాబట్టి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది కాబట్టి ఈ ఊరేగింపులో మన గ్రామ ప్రజలు మరియు అక్క చెల్లెల్లు అన్నదమ్ములు కలిసి శ్రీ సాయిబాబా మరియు దత్తాత్రేయ స్వామి అనుగ్రహం పొందగలరని స్వాగతించాలని శ్రీ గురు పీఠం ట్రస్ట్ గూడూరు తరపున విజ్ఞప్తి చేస్తున్నారు.



# సమన్వయంతోనే సైబర్ నేరాల నియంత్రణ

* **దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో డీజీపీ డా.జితేందర్**

హైదరాబాద్: వివిధ రాష్ట్రాల పోలీస్ శాఖల మధ్య సమన్వయంతోనే సైబర్ నేరాలను సమర్థంగా నియంత్రించవచ్చని తెలంగాణ డీజీపీ డా.జితేందర్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్ అండ్ నికోబార్, పుదుచ్చేరి రాష్ట్రాల సమన్వయ సమావేశంలో డా.జితేందర్ మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే ప్రజలను సైబర్ నేరాల బారి నుంచి కాపాడటం సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ.. కృత్రిమమేధ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ దాడులను ప్రభావవంతంగా తిప్పికొట్టొచ్చన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అవసరమైన పరిజ్ఞానాన్ని రాష్ట్రాలకు అందించడంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ముందుంటుందని ఐ4సీ సీఈవో రాజేశ్‌కుమార్ వివరించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య ప్రాంతీయ సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సమావేశానికి తమిళనాడు, కేరళ సైబర్ నేరాల విభాగాల అదనపు డీజీపీలు సందీప్‌మిత్తల్, వెంకటేశ్, ఏపీ ఈగిల్ ఐజీ రవికృష్ణ, అండమాన్, కర్ణాటక, పుదుచ్చేరి సైబర్ క్రైమ్ ఎస్పీలు మనోజ్‌మీనా, అనూప్‌శెట్టి, చైతన్య వర్చువల్‌గా హాజరయ్యారు.

# భూభారతి ఆర్ఓఆర్ చట్టం లోపాలను సవరించాలి

ఏప్రిల్ 23 ( సమయం న్యూస్) మంచిర్యాల జిల్లా ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూభారతి ఆర్ఓఆర్ చట్టంలోని లోపాలను సవరించి, రైతులకు మేలు చేసే విధంగా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. జిల్లాలోని కాసీపేట మండలం ముత్యంపల్లి గ్రామంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, మొన్నటివరకు ధరణితో రైతుల భూ సమస్యలన్నింటికీ పరిష్కారం చేసుకోవచ్చునని, ధరణి మంచిదని చెప్పిన వారే నేడు ధరణి వల్ల భూ సమస్యలు పెరగాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడు భూభారతి ఆర్ఓఆర్ చట్టం మంచిదని చెప్పిన వారే రేపు మళ్లీ ఉపయోగం లేదని చెప్పడం జరుగుతుంది కావచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. భూభారతిలో భూ సమస్యల పరిష్కారంలో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. వారసత్వ భూమిని వారసులు పంచుకొని, పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే, ఒక ఎకరానికి 2500 రూపాయలు ఫీజు చెల్లించాలని, అదేవిధంగా అధికారుల తప్పిదాల మూలంగా పట్టాలలో తప్పులు సరిచేసుకోవడం కోసం రైతులు ఫీజు కింద 1600 రూపాయలు కట్టవలసి వస్తుందని, ఎవరో చేసిన తప్పులకు రైతులు నష్టపోవడం ఎందుకని ప్రశ్నించారు. సీలింగ్ చట్టంతో భూములు పొందిన చిన్న, సన్నకారు రైతులు, ధరణి పేరుతో గత




ప్రభుత్వం కాస్తు కాలం రద్దు చేయడంతో భూములు కోల్పోవడం జరిగిందన్నారు. 38/ఇ భూములకు దిక్కు లేకుండా పోయిందని, భూస్వాములే మరల సీలింగ్ భూములకు యజమానులుగా మారారని ఆరోపించారు. భూభారతి ఆర్ఓఆర్ చట్టంలోని లోపాలను సరి చేయకుంటే మరో ధరణిగా మిగిలిపోయి, రైతుల భూములకు రక్షణ లేకుండా పోతుందని తెలిపారు.

# అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకం వర్తింపజేయాలి

**: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 సమయం న్యూస్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజిఎం వై సురేష్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం మురళీమోహన్ రావు లతో కలిసి ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకర్లు, మున్సిపల్ కమీషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో పథకంలో భాగంగా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏప్రిల్ 30 లోగా అర్హులను ఎంపిక చేసి, జాబితా సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు 17,545 మంది దరఖాస్తు చేసుకోగా, 5341 యూనిట్లు లక్ష్యంగా 73 కోట్ల 76 లక్షల రూపాయల రాయితీ, 21 కోట్ల 52 లక్షల రూపాయల బ్యాంక్ రుణం అందించడం జరుగుతుందని, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులు 4202 మంది దరఖాస్తు చేసుకోగా 1644 యూనిట్లకు గాను 17 కోట్ల 93 లక్షల రూపాయల రాయితీ, 4 కోట్ల 5 లక్షల రూపాయల బ్యాంక్ రుణం, వెనుకబడిన తరగతులకు చెందిన 30 వేల 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 3907 యూనిట్లు లక్ష్యం కాగా బ్యాంక్ రుణం, రాయితీ కలిపి 45 కోట్ల 35 లక్షల రూపాయలు అందించడం జరుగుతుందని, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన 1047 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 698 యూనిట్లు లక్ష్యం కాగా బ్యాంక్ రుణం, రాయితీ కలిపి 8 కోట్ల 10 లక్షల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. ముస్లిం మైనార్టీకి చెందిన 3107 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 650 యూనిట్లు లక్ష్యంగా బ్యాంక్ రుణం, రాయితీ కలిపి 7 కోట్ల 51 లక్షల రూపాయలు, క్రిస్టియన్ మైనార్టీకి చెందిన 137 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 89 యూనిట్లు లక్ష్యంగా 1 కోటి 42 లక్షల రూపాయలు రాయితీ, 44 లక్షల రూపాయలు బ్యాంక్ రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని వివరించారు. ఏప్రిల్ 30 లోగా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి, మండలాల వారిగా జాబితా రూపొందించాలని, ఈ జాబితాను సంబంధిత బ్యాంక్ అధికారులకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ అధికారి దుర్గాప్రసాద్, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, పరిశ్రమల శాఖ జిఎం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఒకే వేదికపై ఘనంగా సీతారామ ఉమామహేశ్వర కళ్యాణం

గజ్వేల్, ఏప్రిల్22: 8 శతాబ్దలకు పైగా పురాతనమైనగజ్వేల్ పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం సీతారామ ఉమామహేశ్వర దేవతామూర్తుల కళ్యాణం ఒకే వేదికపై అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈవో శశిధర్, ధర్మకర్తలు కాల్వ శ్రీధర్ రావు తది తరులతో నాతగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నుండి సుధాకర్ దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు అందజేశారు. కళ్యాణ్ ఉత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎన్సీ రాజమౌళి గాడిపల్లి భాస్కర్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, డాక్టర్ నరేష్ బాబు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 సమయం న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, ఈ సమ్మె లో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని చార్వాక హాల్లో సిఐటియు నాయకుడు మహేందర్ అధ్యక్షతన మంచిర్యాల పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక కార్మిక సంఘం సిఐటియు అని తెలిపారు. కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను పూర్తిగా కాలరాస్తుందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్ లను తెచ్చి, అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చి, సంవత్సరం గడుస్తున్న హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఏప్రిల్ 27న మంచిర్యాల పట్టణంలోని ఐఎఫ్టియు కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహించడం జరుగుతుందని, ఈ సదస్సుకు సిఐటియు అఖిల భారత కోశాధికారి సాయిబాబా, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు హాజరవుతున్నారని అన్నారు. సమావేశం అనంతరం సిఐటియు మంచిర్యాల పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ నూతన కార్యదర్శిగా దాసరి రాజేశ్వరి, సభ్యులుగా మహేందర్, మౌలాలి, పద్మ, వరలక్ష్మి, రాజ్ కుమార్, అనిల్, శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

గజ్వేల్, ఏప్రిల్ 23: జమ్ము కాశ్మీర్లో ఉగ్రవాద దాడికి నిరసనగా బుధవారం గజ్వేల్ పట్టణంలో ప్రజలు అన్ని పార్టీల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడి హేయనీయమైన చర్య అని, ఉగ్రవాద చర్యల విషయంలో ప్రజలు ఏకమై నిరసన తెలుపడం ప్రజల్లోని జాతీయతా భావాన్ని తెలియపరుస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజమౌళి, భాస్కర్, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి లు అన్నారు.

# అంగన్వాడి చిన్నారులచే బడిబాట కరపత్రాలు ఆవిష్కరణ



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 సమయం న్యూస్: జిల్లాలోని నెన్నెల మండలం గంగారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంగన్వాడి చిన్నారులచే బడిబాట కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థుల పేరెంట్స్ సమావేశం నిర్వహించి, 2024..25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించి ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, అభినందించారు. అనంతరం వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల నమోదు కోసం చేపట్టిన బడి బాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అంగన్వాడి చిన్నారులచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి బాబు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లి దండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు సూచనలు అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా తల్లిదండ్రులు అందరి సహకారం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష్మి, వెంకటేశ్వర స్వామి ఎదుర్కొల్లు

గజ్వేల్, ఏప్రిల్ 23: గజ్వేల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి ఎదుర్కొలను ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ వెంకటేశ్వర ఆలయం నుండి డప్పు కళాకారుల భారీ ప్రదర్శనతో, వివిధ దేవత అలంకరణలతో, విద్యుత్ దీపాల వెలుగులతో ఎదుర్కొల్లు ఘనంగా ప్రారంభం అయ్యాయి. అంగడిపేట హనుమాన్ ఆలయం వద్ద స్వామివారిని ఎదుర్కొని వెంకటేశ్వర స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. గురువారం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాస్ ఆచార్యుల వైదికనిర్వణలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.

## పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా

# బోధన్‌లో హిందూ సంఘాల ఖాషుడా ర్యాలీ





*** ఉగ్రవాదంపై మండిపడ్డ నేతలు**

**బోధన్ పట్టణం, ఏప్రిల్ 23, సమయం న్యూస్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రవాద దాడికి, అలాగే పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బోధన్ పట్టణంలో హిందూ సంఘాల ఐక్యవేదిక సమితి ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించబడింది.

*** బోధన్‌లో ఖాషుడాలతో భారీ ర్యాలీ**

మారుతి మందిర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ కొత్త బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో పాల్గొన్నవారు ఖాషుడాలు ధరించి ఉగ్రవాదం వ్యతిరేక నినాదాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల చిత్రపటాన్ని దహనం చేసి తమ వ్యతిరేకతను వ్యక్తపరిచారు.

*** మౌనం పాటించి నివాళి**

ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 27 మంది మృతులకు రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. దాడిలో పలువురు తీవ్రంగా గాయపడిన విషయాన్ని కూడా హిందూ సంఘాల నాయకులు ఆవేదనతో పేర్కొన్నారు.

*** హిందూ సంఘాల నేతల ఖండన**

హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ, పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని, బాధ్యులపై భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.

*** ప్రభుత్వం మద్దతు కోరిన నేతలు**

గాయపడిన వారికి మెరుగైన వైద్యం, మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశ ప్రజలు ఉగ్రవాదంపై అవగాహనతో ముందుకు రావాలని, అంతర్జాతీయ మద్దతు కూడా అవసరమని పేర్కొన్నారు.



## ఉగ్రదాడి మృతుల ఆత్మలకు శాంతి కలగాలి

*** ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ**

గజ్వేల్, ఏప్రిల్ 23 : కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన పౌరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం ప్రజ్ఞాపూర్ లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద దాడిని వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, సాగర్, ఉప్పలయ్య, మహేందర్, యాదగిరి, శివకుమార్, రమేష్, శ్రీనివాస్ విజయ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఇంతవరకు గెలిచిన అనుభూతిని పొందలేదు

: తిలక్ వర్మ



ఐపీఎల్ 2025లో ముంబయి ఇండియన్స్ కాస్త ఆలస్యంగా జోరందుకుంది. తొలి ఐదు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించిన ఆ జట్టు.. తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. ఇక, ముంబయి ఇండియన్స్‌కు ఆడుతున్న హైదరాబాదీ ప్లేయర్ తిలక్ వర్మ ఈ సారి తమ జట్టు టైటిల్ గెలుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశాడు. 2022లో ముంబయి జట్టులో చేరిన తిలక్.. తక్కువ కాలంలో జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. దాదాపు ప్రతి సీజన్‌లో రాణించాడు. కానీ, ముంబయి మాత్రం టైటిల్ గెలవలేకపోయింది. 'నేను 2022లో ముంబయి జట్టులో చేరా. కానీ అప్పటి నుంచి మేము ట్రోఫీని గెలవలేదు. నాకు ఇప్పటివరకు విన్నింగ్ ఫీల్‌ను పొందలేదని రోహిత్ భాయ్, సూర్యా భాయ్‌లకు ఎప్పుడూ చెబుతూనే ఉంటా. వ్యక్తిగతంగా గత మూడు సీజన్‌లు నాకు బాగానే సాగాయి. కానీ, జట్టుపరంగా మేము కోరుకున్న ఫలితాలు రాలేదు. ఈ సంవత్సరం మేము ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. సర్వశక్తులు ఒడ్డి టైటిల్ గెలవడానికి ప్రయత్నిస్తాం. హార్దిక్ భాయ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. టీ20 అరంగేట్రంలో అతని చేతుల మీదుగానే క్యాప్ అందుకున్నా. అది చాలా ప్రత్యేకమైన అనుభవం. గతేడాది నుంచి హార్దిక్‌తో కలిసి ఆడుతున్నా. అతను ప్లేయర్లకు ఎప్పుడే మద్దతుగా ఉంటాడు. ఏదైనా తప్పు చేస్తే ముఖం మీదే చెప్పేస్తాడు. సూర్యకుమార్ యాదవ్ మన చుట్టూ సానుకూల వాతావరణం ఉండేలా చేస్తాడు. వికెట్ల మధ్య పరుగెత్తుతున్నప్పుడు మా మధ్య గొప్ప అవగాహన ఉంటుంది. ఎంత ఒత్తిడి ఉన్నా బుమ్రా చాలా ప్రశాంతంగా ఉంటాడు. పరిస్థితులు ఎలా ఉన్న అతని ముఖంలో ఆందోళన కనిపించదు. టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో అతను 19వ ఓవర్ వేసినప్పుడు కూడా అతను కేవలం నెట్స్‌లో బౌలింగ్ చేసినట్లు అనిపించింది' అని తిలక్ వర్మ వివరించాడు. ఈ సీజన్‌లో తిలక్ 8 మ్యాచ్‌ల్లో 141.72 స్ట్రైక్‌రేట్‌తో 231 పరుగులు చేశాడు. ఇందులో రెండు అర్ధ శతకాలున్నాయి.

## విజృంభించిన దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్.. పీకల్లోతు కష్టాల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్

హైదరాబాద్: ఐపీఎల్ 2025లో భాగంగా సొంత మైదానంలో ముంబయి ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (Sunrisers Hyderabad) బ్యాటర్లు ఘోరంగా విఫలమవుతున్నారు. ముంబయి పేసర్లు దీపక్ చాహర్ (2/12), ట్రెంట్ బౌల్ట్ (2/8) విజృంభించడంతో మొదటి నలుగురు బ్యాటర్లలో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. ట్రావిస్ హెడ్ నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్ కాగా.. అభిషేక్ శర్మ (8) పరుగులకే వెనుదిరిగాడు. ఇషాన్ కిషన్ (1), నితీశ్ కుమార్ రెడ్డి (2) కూడా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. హార్దిక్ బౌలింగ్‌లో అనికేత్ వర్మ (12) ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. 9 ఓవర్లకు హైదరాబాద్ 37/5 స్కోరుతో ఉంది. హెన్రిచ్ క్లాసెన్ (11), అభినవ్ మనోహర్ (1) క్రీజులో ఉన్నారు.



### 'కల్కి 2' రిలీజ్ ఎప్పుడు?..
## నాగ్ అశ్విన్ ఫన్నీ రిప్లై



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకొని కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో దీని సీక్వెల్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నాగ్ అశ్విన్ 'కల్కి 2' రిలీజ్‌పై ఫన్నీ రిప్లై ఇచ్చారు. 'కల్కి 2' ఎప్పుడు రిలీజ్ చేస్తారని అడగ్గా.. ''కల్కి'ని 3, 4 గ్రహాలు ఒకే వరుసలో ఉన్నప్పుడు విడుదల చేశాను. దాని సీక్వెల్‌ను 7, 8 గ్రహాలు ఒకే వరుసలోకి వచ్చినప్పుడు రిలీజ్ చేస్తా. వేచి ఉండండి' అని ఫన్నీగా స్పందించారు. ప్రస్తుతం ఆయన రిప్లై వైరల్‌గా మారింది. ఇక ఇటీవల కూడా ఆయన 'కల్కి 2'పై స్పందించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పార్ట్ 2లో ప్రభాస్ ఎక్కువసేపు స్క్రీన్‌పై కనిపిస్తారని.. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుతుందని తెలిపారు. రెండో భాగంలో వీరిద్దరి పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు.

# గుండె బరువెక్కుతోంది

## జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండించిన సెలబ్రిటీలు





**జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో టెర్రరిస్టుల అటాక్‌పై దేశవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తుతున్నాయి. ఈ పెనువిషాదంపై టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ సెలబ్రిటీలు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 28 మంది అమాయకులను బలిగొన్న దారుణమైన ఈ ఉగ్రదాడి అత్యంత క్షమించరాని క్రూరమైన చర్య అని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు వివరించారు. దీనిపై వీడియో చేస్తూ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కన్నీరు పెట్టుకున్నారు.- అమాయక పర్యాటకులపై జరిగిన పిరికిపంద ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని సోనూసూద్ అన్నారు. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదన్నారు. ఈ దుర్మార్గపు చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపారు.**

- బాధితులను చూస్తుంటే నా గుండె బరువెక్కుతోంది. . ఇలాంటి దారుణాలు జరగకూడదు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. శాంతి కోసం ప్రార్థిస్తున్నా: **ఎన్టీఆర్**
- టెర్రరిస్టుల అటాక్ నా మనసును కదిలించేసింది. సొసైటీలో ఇలాంటి దారుణాలకు చోటులేదు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా: **రామ్ చరణ్**
- ఇది క్షమించరాని చర్య. ఈ ఉగ్ర చర్యపై అందరూ మౌనం వీడండి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. వారికి తగినవిధంగా బుద్ధి చెప్పాలి: **సంజయ్‌దత్**
- ఈ దాడి భయంకరమైనది. అమాయకులను చంపడం చాలా దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా: **అక్షయ్ కుమార్**
- పహల్గాం ఉగ్రదాడి గురించి తెలిసి దిగ్భ్రాంతి చెందాను. నా గుండె బరువెక్కింది. ఆర్మీ డ్రెస్సులో వచ్చి కాల్పులు జరపడం అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నా. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా. మేమంతా మీ వెంట ఉన్నాం. ఈ బాధ నుంచి కోలుకునే ధైర్యాన్నివ్వాలని దేవుడిని వేడుకుంటున్నా: **జాన్వీ కపూర్**
- పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఈ దాడి గురించి తెలిసి నా గుండె పగిలిపోయింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. మృతి చెందిన అమాయకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను: **అల్లు అర్జున్**
- మూడు నెలల క్రితం షూటింగ్ కోసం పహల్గాం వెళ్లిన. 200 మంది అక్కడ పనిచేశాం. ఇంతలోనే అక్కడ ఇలాంటి దారుణాన్ని ఊహించలేదు. అక్కడ జరిగిన దారుణం నా హృదయాన్ని కలిచివేస్తోంది. ఇంత దారుణం ఎందుకు చేశారు?: **నేచురల్ స్టార్ నాని**
- బాధితులను చూస్తుంటే నా గుండె పగిలింది. ఇది అనాగరికమైన చర్య. ఇలాంటి క్రూరత్వానికి వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా ఉండాలి. శాంతి కోసం ప్రార్థిస్తున్నా: **రష్మిక**
- రెండేండ్ల క్రితం నా బర్త్‌డే పహల్గాంలోనే సెలబ్రేట్ చేసుకున్న. అక్కడి ప్రజలు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. మనదేశం ఎప్పుడూ ఉగ్రవాదాన్ని సమర్థించదు: **విజయ్‌దేవరకొండ**




## నాజర్ హారర్ థ్రిల్లర్: తెలుగులో స్ట్రీమింగ్‌కు రెడీ

ఓటీటీ 'ఆహా'లో ఇప్పటి వరకూ తమిళ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'ది అకాలీ' ఇకపై తెలుగులోనూ థ్రిల్ చేయనుంది. అదే ఓటీటీ ఈ నెల 26 నుంచి తెలుగు ఆడియో అందుబాటులో ఉండనుంది. నాజర్, వినోద్ కిషన్, తలైవాసల్ విజయ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు మహ్మద్ అసిఫ్ హమీద్ తెరకెక్కించిన హారర్ థ్రిల్ మూవీ ఇది. గతేడాది థియేటర్లలో విడుదలైంది. జానిస్ అనే అమ్మాయి వరుస హత్యలు చేస్తుంటుంది. సంబంధిత కేసును ఛేదించే క్రమంలో పోలీసు అధికారికి విస్తుపోయే విషయాలు తెలుస్తాయి. మరి, జానిస్ ఎందుకు మర్డర్స్ చేయాల్సి వచ్చింది? ఆమె వెనుక ఎవరైనా ఉన్నారా? తదితర ఆసక్తికర అంశాలతో ఈ చిత్రం రూపొందింది.

# హాయ్ పింపుల్

'సీతారామం' బ్యూటీ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం అడవి శేష్‌తో కలిసి 'డెకాయిట్' మూవీలో నటిస్తున్న విషయం తెల్సిందే. తెలుగులో మరికొన్ని చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. అయితే హిందీలో మాత్రం ఈభామ దాదాపు అర డజను సినిమాలు చేస్తోంది. త్వరలోనే తమిళ్ మూవీతోనూ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే వరుస మూవీలతో బిజీ బిజీగా ఉన్న మృణాల్ సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. రెగ్యులర్‌గా అందమైన పిక్స్‌షేర్ చేస్తూ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఈ వయ్యారి భామ పోస్ట్‌చేసిన పిక్‌నెట్టింట వైరల్‌గా మారింది. తన క్లోజప్ ఫొటోను షేర్ చేసి ఫేస్ పై ఉన్న మొటిమను చూపించింది. దీనికి 'హాయ్ పింపుల్, నువ్వు వెళ్లేది ఎప్పుడు..? నాకు త్వరలోనే షూట్ ఉంది' అంటూ స్మైల్ ఈమోజీలను షేర్ చేసింది. మృణాల్ ఆ మొటిమతోనూ చాలా అందంగా ఉందని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.





# మేం సేఫ్

## త్రుటిలో ఉగ్రదాడిని తప్పించుకున్న సెలబ్రిటీ జంట



నిన్న మధ్యాహ్నం జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అమాయకులు చనిపోగా.. మరికొందరు వారి ప్రాణాలను అరచేతపట్టుకొని బయటపడ్డారు. అయితే ఈ ఉగ్రదాడి జరగడానికి కొన్ని గంటల ముందే ఆ ప్రాంతాన్ని వీడినట్లు నటి దీపికా కాకర్ జంట తెలిపింది. నటి దీపికా కాకర్ తన భర్త షోయబ్ ఇబ్రహీంతో కలిసి ఇటీవల కశ్మీర్ ట్రిప్‌కు వెళ్లారు. దీనికి సంబంధించిన ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే నిన్న మధ్యాహ్నం అక్కడ ఉగ్రదాడి జరిగిన తర్వాత నెటిజన్లు, ఫ్యాన్స్ వీరి గురించి ఆందోళన చెందారు. ఈ ఘటనలో వారు చిక్కుక్కున్నారేమోనని మెసేజ్‌లు పెట్టారు. దీంతో తాజాగా దీపికా, ఆమె భర్త షోయబ్ తాము క్షేమంగా బయటపడ్డామంటూ ఓ పోస్టు పెట్టారు. 'మేం సేఫ్‌గానే ఉన్నాం. నిన్న ఉదయమే కశ్మీర్ నుంచి బయలుదేరాం. సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నాం. ఎవరూ ఆందోళన పడకండి' అని ఇన్‌స్టాలో తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.